# సింగిల్ పేజి కథలు

## అంతరంగం

**భరద్వాజ యింట్లోకి రాగానే, తన గదిలోంచి గబ గబా బయటికి వచ్చింది సుభద్రమ్మగారు. "నే చెప్పిన పుస్తకాలు తెచ్చావా బాబూ!" అంటూ అడిగింది.**

గతుక్కుమన్నాడు భరద్వాజ. మర్చిపోయాడు. పొద్దున్న ఆఫీసుకి వెళ్తున్నప్పుడు తల్లి తెలుగు పత్రికలు తెమ్మని చెప్పిన విషయం యిప్పుడు మళ్లీ తల్లి వేసిన ప్రశ్నతోనే జ్ఞాపకం వచ్చింది. లేదు అని చెప్పటానికి అతనికి అదోలా అనిపించింది. అందుకే అన్నాడు ''రేపు తప్పకుండా తెస్తాను'' అని.

వాళ్ళు వుండేది పరాయి రాష్ట్రం. తెలుగు మాట్లాడే వాళ్ళు తక్కువ. తెలుగు పుస్తకాలు దొరకటం కూడా అపురూపమే! ఇవాళ భరద్వాజ రోజూ వెళ్ళే ఆఫీసుకి కాకుండా వేరే బ్రాంచికి వెళ్ళాడు. ఆ ఏరియాలో తెలుగు పుస్తకాలు ఎక్కువగా దొరుకుతాయి.

''నా పుస్తకాలంటూ రేపు నీకు అటు వెళ్ళడం వీలవుతుందా?''

''నేను వెళ్ళకపోతే ఆ ఏరియా నుంచి ఆఫీసుకి వచ్చేవాళ్ళకి చెప్పి తెప్పిస్తానులే!''

''నీకు నే చెప్పిన విషయం గుర్తులేదుగానీ-బయటి వాడికి గుర్తుంటుందీ? ఏదో సర్దిచెప్పటం కాకపోతే!'' విసుక్కుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

భరద్వాజ ఆశ్చర్యంగా తల్లి వెళ్ళిన వైపే చూస్తూండిపోయాడు. తల్లి విసుగ్గా మాట్లాడటం అతనికి అలవాటు లేదు.

మనిషికీ మరీ తీరిక ఎక్కువయిపోయినా విసుగెక్కువయిపోతుంది. అమ్మ ఏ పని చెయ్యటానికీ, నీరజ ఒప్పుకోదు. ఏదో తన పని తను చేసుకోవటానికి తప్ప!

ఏవో చిన్న చిన్న పనులు తనవి చేసుకుంటోంది. అంతకన్నా ఎక్కువగా చేసే ఓపికా లేదు. వయస్సు పైబడుతోంది మరి. ఆవిడకి పనిలేదని కాలం చిన్నదయిపోదుగా మరి. తోచక యింకా ఎక్కువయినట్టుగా వుంది. ఇంట్లో బోలెడన్ని ఆధ్యాత్మిక గ్రంథాలున్నాయ్. ఎన్నిసార్లు చెప్పినా వాటిజోలికి వెళ్ళదు.

తన భార్య నీరజకి అత్తగారంటే అక్కడే అలుసు. ''యింత వయసొచ్చింది..క్రిష్ణా రామా అంటూ కాలక్షేపం చేద్దాం అని లేదు మీ అమ్మకి. ఆ టి.వి.లో తైతెక్కలు, కక్షలు, కొట్లాటలు చూడటం తప్ప''

ఆలోచిస్తూ బట్టలు మార్చుకుంటున్న భరద్వాజకి ముందు హాల్లో భార్య, తల్లి వేడివేడిగా వాదించుకోవటం వినిపించింది. ఇలాంటి సందర్భాల్లో తను అక్కడికి వెళ్ళకపోవటమే మంచిదనిపించి మంచం మీద వాలిపోయాడు. ఒకటి మాత్రం అనిపించిందతనికి. అమ్మ స్వభావంలో ఏదో మార్పు వచ్చింది ఈమధ్య. చీటికీ మాటికీ చిర్రుబుర్రులాడుతోంది.

అయిదు నిముషాల్లో నీరజ భరద్వాజ పడుకున్న గదిలోకి తుపానులా వచ్చింది. ''చూశారా మీ అమ్మ అభియోగం! నువ్వయినా నా కొడుక్కి నేను పుస్తకాలు తెమ్మన్న విషయం చెప్పొచ్చు కదా నేనెప్పుడు విరగడయిపోతానా అని చూస్తున్నావ్. నువ్వేం చెప్తావులే అంటోంది'' ఇలా చెబుతున్నప్పుడు నీరజ కళ్ళలోకి నీళ్ళు వచ్చేశాయ్. ఎందుకంటే ఆమె అలా ఆలోచించే మనిషి కాదు కనుక.

''పొద్దున్నుంచి పని హడావుడిలో వున్నాను. నాకు మీ యిద్దరూ ఏం మాట్లాడుకున్నారో వినే తీరికెక్కడిది!''

భరద్వాజకి నిజంగానే కోపం వచ్చింది. తల్లి అక్కర్లేని, అవసరం లేని మాటలు మాట్లాడి యింట్లో సమస్యలు సృష్టిస్తోందనిపించింది. ఇలాంటి మాటలు మాట్లాడితే నీరజలో వున్న మంచితనం కూడా పోతుంది.

వెళ్ళి అదేమాట చెప్పబోతే భరద్వాజకి తల్లితో పెద్ద వాగ్వివాదమే అయింది. ఎప్పుడూ పల్లెత్తు మాట అనని భరద్వాజని అర్థం పర్థం లేని అభియోగాలతో విసుగెత్తించి నానా మాటలూ అనేలా చేసింది సుభద్రమ్మగారు.

నీరజ, భరద్వాజ ఆ రాత్రి కూర్చుని చర్చించుకున్నారు. వయస్సుతో వచ్చే సమస్యలా యివి అన్న ప్రశ్నార్థకమే నిలిచింది వాళ్ళ మనస్సుల్లో. ఇంతలో ఏదో స్ఫురించినట్లుగా, కారణం తెలిసినట్టుగా అంది నీరజ...''ఈమధ్యన మన ఎదురింటావిడ అత్తగారితో స్నేహం, కబుర్లు ఎక్కువయ్యాయిలెండి. ఆవిడ రాక్షసి. అత్తయ్యగారికి దెబ్బలాడమని చెబుతున్నట్టుగా వుంది'' భరద్వాజకి నిజమే ననిపించింది. రెండు రోజుల తర్వాత భరద్వాజ యింటికి వచ్చేటప్పటికి నీరజ కళ్ళు ఎర్రగా వున్నాయ్ ఏడ్చినట్టుగా. ఏమిటీ అంటే జరిగిన విషయం సుభద్రమ్మగారు ఎదురింటికి వెళ్ళి వచ్చి బెల్ కొట్టినప్పుడు అర నిముషంలో యిరవైసార్లు కొట్టిందిట. నీరజ తలుపు తీసి ''అన్నిసార్లు కొట్టడం ఎందుకు? ఒక్కసారో, రెండుసార్లో కొడితే తలుపు తియ్యనా'' అన్నందుకు తల్లి నీరజ మీద భద్రకాళిలా విరుచుకుపడిపోయిందిట.

''అన్నిసార్లు బెల్ కొడితే మాత్రం తప్పేమిటి?'' అంటూ ఏమిటేమిటో అభియోగాలు చెయ్యటం మొదలుపెట్టిందిట.

''ఎదురింటికి వెళ్ళడాన్ని ఎలాగో అలా ఆపెయ్యాలి!'' అని యిద్దరూ అనుకున్నారు. కానీ అది సాధ్యం కాలేదు. పక్క సంసారాల్లో చిచ్చుపెట్టే వాళ్ళు ఎంతమందో అని యిద్దరూ వాపోయారు.

★ ★ ★

అప్పటికి సుభద్రమ్మ పోయి నెల రోజులవుతోంది. కళ్ళనిండా నీళ్ళతో తల్లి బీరువా సర్దుతున్న భరద్వాజకి చిన్న కాగితాల మడత దొరికింది. ఏవిటా అని విప్పి చూసిన భరద్వాజ కళ్ళు అందులోని అక్షరాల వెంట పరుగుతీశాయ్.

మంగళవారం: ఇవ్వాళ భరద్వాజతో పుస్తకాల గురించి పెద్ద తగువు పెట్టుకున్నాను. నీరజతో కూడా! నాకెంత ఆనందంగా అనిపించిందో! వాళ్ళిద్దరూ నావైపే చూస్తూ నాతో ఎంతసేపు మాట్లాడారో! దెబ్బలాటయినా మాటలేగా! మరుపు మనిషికి సహజం. అందులోనూ ఆఫీసుకి వెళ్ళాక భరద్వాజకి యింటి పనులు గురించి ఆలోచించే సమయం వుండదు. నాకు తెలుసు. కానీ వాడితో మాటల కోసమే వాడితో తగవు పెట్టుకున్నాను.

శుక్రవారం: యివ్వాళ కాలింగ్ బెల్ పదే పదే కొట్టి నీరజతో దెబ్బలాట పెట్టుకున్నాను. చాలా ఆనందంగా అనిపించింది. ఓ అరగంట వాదించుకున్నాం. అంటే అరగంట మాట్లాడుకున్నాం! ఒక్కసారే బెల్‌కొడితే తలుపు తీసి మౌనంగా లోపలికి వెళ్ళిపోతుంది మరి. ఎలా దెబ్బలాట పెట్టుకోవాలా అన్న ఆలోచనతో బుర్ర వేడెక్కిపోతోంది.

భరద్వాజకి ఒక్క నిముషం ఏం అర్థం కాలేదు. అర్థం అయిన కొద్దీ అతనికి దుఃఖం పొంగుకొచ్చింది.

అమ్మకి ప్రత్యేకమయిన గదీ, అందులో అన్ని సదుపాయాలు సమకూర్చానని అనుకున్నాడే గానీ, ఎవరి పనుల్లో వాళ్ళు బిజీ అయిపోయి, ఆవిడ్ని పలకరించాలనీ, అప్పుడప్పుడయినా కాస్సేపు కబుర్లు చెప్పి నువ్వు మాలో ఒకదానివి అన్న భద్రతా భావాన్ని కల్గించాలన్న విషయాన్ని గ్రహించలేకపోయాడు.

కారణాలు యింకేవేవో వెతికాడు. బీరువాలో అలాంటి కాగితాలింకా ఎన్నో. నీరజని పిలిచి చూపిస్తే ఆమె నిశ్చేష్టురాలయింది.

మాట! మనుష్యుల్ని దగ్గరకి చేర్చేది, హృదయ స్పందనకి ప్రతిరూపం. మనసులోని ఆత్మీయతని పన్నీటిజల్లులా కురిపించేది.

**-దర్భా లక్ష్మీ అన్నపూర్ణ** (బెంగుళూరు)